


ఆమె శిరస్సువైపునకు నడిచాయి. అప్పటివరకూ అడ్డుగా ఉన్న పరదాను కొద్దిగా తొలగించి.. చందమామలాంటి తన వదనబింబాన్ని కనిపింప చేసింది శశాంకవతి.

దాంతో ఫణిదత్తుని గుండెల్లో ఒక మెరుపు మెరిసింది. కళ్లకు మిరుమిట్లు గొలిపింది. అతనేదో గందరగోళంలో పడుతుండగానే రాకుమారి ఒక లేఖను అతని జేబులో జారవిడిచింది.

ఫణిదత్తుడు కొంచెం తెప్పరిల్లిన తరువాత..

''మరేమీ పరవాలేదు. కాసేపు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది'' అంటూ బయటికి నడిచాడు.

అతని వెనుకే వస్తూ..

''ఆర్యా! మీరిప్పట్లో మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లడానికి వీల్లేదు. కొంతకాలం ఇక్కడే ఉండి తీరాలి'' అన్నాడు భూరిశ్రవుడు.

అతనికి మౌనంతోనే.. 'సరే!' అని చెప్పి, తన బసకు చేరుకున్నాడు ఫణిదత్తుడు. రాకుమారి తన జేబులో విడిచిన లేఖను ఆత్రంగా తీసి చదవసాగాడు.

అందులో ఇలా ఉంది..

'సౌమ్యా! నువ్వు ఆనాడు శమనమనే లోకానికి చేరుకున్న నన్ను క్షేమంగా వెనక్కు తెచ్చావు. నీ మంత్రమహిమను వర్ణించలేను. నువ్వు కోరుకుంటే ఏ స్థితిలో ఉన్నా నాకు ప్రాణదానం చేయగలవు. అయినప్పటికీ నువ్వే నా పాలిట మృత్యుదాతవు కూడా అవుతున్నావని ఈమధ్య అనిపిస్తున్నది. నిన్ను చూసినకొద్దీ చూడాలనిపిస్తున్నది. చూడలేకపోతే చావాలనిపిస్తున్నది. ఈమాట మా తండ్రికి చెబితే నన్ను బతకనివ్వడు. నేను బతకడం ఎలాగో తెలియడం లేదు. దయచేసి దారి చెప్పు'.

ఆ లేఖను చదువుకున్న ఫణిదత్తుడు..

''స్త్రీల మాయలు బ్రహ్మకు కూడా తెలియవు కదా!'' అన్నాడు.

అందుకు సుబాహుడు..

''ఇంతకూ ఆమె మనోభీష్టం ఏమిటో తెలుసుకున్నావా? వాళ్ల నాన్నను ఒప్పించి పెళ్లాడమంటున్నదా?! లేవదీసుకు పొమ్మంటున్నదా?! మరోసారి కనిపిస్తే చాలంటున్నదా?!'' అని అడిగాడు.

ఆ మాటతో ఆలోచనలో పడ్డాడు ఫణిదత్తుడు.

ఆనాటి అర్ధరాత్రి.. అంతకుముందు రాజకుమారి మందిరం వరకూ తాము తవ్విన బిలమార్గాన్ని తెరిచాడు. ఒళ్లెరగకుండా నిద్రపోతున్న రాకుమారి పక్కమీద ఒక లేఖను పెట్టి, వెనుతిరిగాడు.

తెల్లవారి ఆ లేఖను చూసిన రాకుమారి తెల్లబోయింది. తెరిచి చూస్తే దాంట్లో ఇలా ఉంది.

'దారి చూపమని నన్ను కోరావు. కోరుకుంటే నీ గది కిందనే బిలముదారి ఒకటుంది. అయినా ఈ దారులలో ఏముంది?! అభిలాష తీరాలంటే మనసులలో పుట్టే సాహసమే అసలైన దారి'..

లేఖను చదువుకున్న రాకుమారి తన గదినంతా శోధించింది. ఒకచోట నేలపై బండలు కొద్దిగా కదిలి ఉండటం గమనించింది. ఒక బండను పక్కకు తొలగించి చూస్తే బిలమార్గం బయటపడింది. అప్పుడు లేఖను మరోసారి చదువుకుంది. 'సాహసం ఉంటే ఈ దారివెంట రావచ్చు' అని అతను చెప్పినట్లుంది. కానీ, అదే సాహసం ఉంటే.. అతనే మళ్లీ వచ్చేవరకు నేను వేచి ఉండలేనా అనుకుంది రాకుమారి.

ఆనాటి రాత్రివరకు ఆమె రాకకోసం ఎదురుచూసిన ఫణిదత్తుని మనసులో కలవరపాటు మొదలైంది.

'ఆ లేఖ వేరెవరి చేతిలోనైనా పడిందా? ఆమె చదివిందో లేదో' అని పరిపరివిధాల తలపోశాడు.

చివరికి తానే బయల్దేరి వెళ్లాడు. బండనెత్తి, గదిలోనికి ఎక్కేసరికి.. శశాంకవతి నిద్రపోతూ కనిపించింది.

కానీ, గది వాతావరణం ఇంతకుముందులా లేదు. పరిమళ ద్రవ్యాల సువాసనలు హాయి గొలుపుతున్నాయి. మంచం పక్కనే రకరకాల పిండివంటలు ఉన్నాయి. వాటితోపాటు తీరైన తాంబూలపు పళ్లెం కూడా ఉంది.

ఆకాశపు నీలిమంచంమీద నిద్రిస్తున్న చందమామలాగా ఉన్న శశాంకవతి ముఖాన్ని చూస్తున్న ఫణిదత్తుని మనసు.. పున్నమినాటి సముద్రంలా ఉప్పొంగుతున్నది.

అతనేం చేస్తాడో చూడాలనుకుని దొంగనిద్ర నటిస్తున్న శశాంకవతి.. చాలాసేపు తనను తాను నిలువరించుకోలేక తపన పడింది. తానింకా జాగుచేస్తే, ఫణిదత్తుడు తిరిగి వెళ్లిపోతాడేమో అన్న అనుమానం తోచగానే.. పైకి లేచి, అతని చేయిపట్టుకుంది.

''కుమారవతీ! రావే దొంగ దొరికాడు'' అన్నది.

నిజంగానే ఎవరో వచ్చి తనను పట్టుకుంటారేమోనని భయపడ్డాడు ఫణిదత్తుడు. ఉట్టిది.. అక్కడెవరూ లేరు.

బిక్కమొగం వేసిన ఫణిదత్తుని చెయ్యి విడిచిపెట్టి, మంచంమీద విలాసంగా కూర్చుని, హాయలుపోతూ..

''మోహనాంగా! నువ్విక్కడికి ఎలా వచ్చావు? ఈ కన్నపు దొంగతనం ఎప్పుడు నేర్చుకున్నావు?'' అన్నది.

ఫణిదత్తుడు గుటకలు మింగసాగాడు.

అంతలోనే శశాంకవతి మంచం మీదనుంచి లేచి..

''ఇంటికి వచ్చిన అతిథి ఎట్టివాడైనా పూజించాలి కదా! దయచేసి ఇలా కూర్చోండి'' అన్నది.

అతణ్ని మంచంమీద కూర్చోబెట్టి, పూలమాల మెడలో వేసింది. గంధం పూసి, పన్నీరు చల్లింది. కొన్ని పిండివంటలు తినిపించి, పానీయాలు తాగించింది. చివరిగా తాంబూలం అందించింది.

''మహాభాగా! నన్ను నీదానినిగా చేసుకో'' అన్నది.

ఆ రాత్రి నుంచి వారి రహస్య అనుబంధం కొనసాగింది. ప్రతిరాత్రీ బిలమార్గం ద్వారా ఫణిదత్తుడు రాకుమారి వద్దకు వెళ్తుండేవాడు. తెల్లవారకమునుపే తిరిగి వచ్చేవాడు. అలా కొంతకాలం గడిచేసరికి శశాంకవతి గర్భవతి అయింది. ఆ విషయాన్ని ఎవరో అంతఃపుర చారులు పసిగట్టారు. కానీ, దానికి కారకుడు ఫణిదత్తుడే అని తెలియలేదు.

'నీ కూతురు గర్భవతి అయింది' అని మాత్రమే భూరిశ్రవునికి తెలియచేశారు.

ఆ వార్తవిని మహారాజు ఆగ్రహోదగ్రుడయ్యాడు. వెంటనే కుమార్తె వద్దకు బయల్దేరబోయాడు.

కానీ, అప్పటికే ఎవరో తనపై చాడీలు చెబుతున్నారన్న సంగతి తెలిసిన శశాంకవతి.. బిలమార్గం ద్వారా బయటికి వెళ్లిపోయింది. వెళ్లిపోతూ ఒక పరిచారికను తండ్రి వద్దకు పంపింది.

''మహారాజా! రాకుమారి మేడమీద ఆడుకుంటుండగా ఎవరో భయంకరాకారుడు ఆకాశంనుంచి ఎగిరి వచ్చి ఎత్తుకుపోయాడు'' అని చెప్పింది ఆ పరిచారిక.

భూరిశ్రవుడు ఆమాట విని అదిరిపడ్డాడు.

ఏం చేయాలో అర్థంకాక మంత్రులను, శ్రేయోభిలాషులను సలహాకోసం పిలిపించాడు. అలా వచ్చినవారిలో ఫణిదత్తుడు కూడా ఉన్నాడు.

''ఆకాశగమనం చేసేవారు దేవతలైతే.. వారెప్పుడూ మానవకాంతలను ఎత్తుకుపోరు. అన్యులైతే వారికి భూమి పరిధినుంచి ఆవలిదాకా మానవులను తీసుకుపోయే శక్తి ఉండదు. కనుక, నాలుగు దిక్కులకూ సైన్యాన్ని పంపించి, రాకుమారిని వెతికించండి'' అన్నాడు ఫణిదత్తుడు.

ఆమాటతో భూరిశ్రవునికి కాస్త ఊరట లభించింది. అప్పటికప్పుడు సైన్యాన్ని విభాగం చేసి నాలుగుదిక్కులకూ పంపాడు. ఉత్తరదిక్కుకు వెళ్లిన సైన్యానికి ఫణిదత్తుడే నాయకత్వం వహించాడు. నిజానికి, బిలమార్గం ద్వారా తనవద్దకు వచ్చిన శశాంకవతికి తన స్నేహితులను తోడిచ్చి.. ఉత్తరదిక్కుగా వెళ్లమని సూచించింది అతనే.

ఇప్పుడు వాళ్లను వెతుక్కుంటూ తానే బయల్దేరాడు. కొంతదూరం వెళ్లిన తరవాత తనతోపాటు వచ్చిన సైన్యాన్ని వేర్వేరు దిక్కులకు విభాగించి.. తానొక్కడే వేరొక మార్గంలో వెళ్లాడు. కానీ, మూడురోజులు ప్రయాణం చేసినా ఫణిదత్తుడు స్నేహితులను కలుసుకోలేకపోయాడు. ఎక్కడైనా దారితప్పారేమో అని మధనపడుతుండగా.. చివరికి ఒకచోట ఒంటినిండా గాయాలతో సుప్రహస్తుడు మొదలైనవారు కనిపించారు.

''మిత్రులారా! ఏమిటిది.. మిమ్మల్నిలా కొట్టిందెవరు?! రాకుమారి ఏమయ్యింది?'' అని ప్రశ్నించాడు.

''ఫణిదత్తా! మేమీ దారిలో వస్తుండగా.. అటువైపు ఒక జనపదం, ఇటువైపు అరణ్యమార్గం కనిపించింది. జనపదాన్ని వద్దనుకుని, అడవిమార్గం పట్టాం. మేము వెళ్తుండగా దాదాపు వెయ్యిమంది రౌతులు ఎదురువచ్చారు. ఎందుకైనా మంచిదని వారికి ఎదురుపడకుండా కొంచెం దూరంగా జరిగి వేచి ఉన్నాం. మరికొంచెం సేపైతే ఆ సైన్యం మమ్మల్ని దాటిపోయేదే.. కానీ అంతలోనే ఆ సేనానాయకుడు వెనుతిరిగి వచ్చాడు. రాకుమారిని ఒడుపుగా పట్టుకుని, తన గుర్రం మీదికి లాక్కున్నాడు. మేము ప్రతిఘటించాం. కానీ, వెయ్యిమందిని ఎదుర్కోవడం, ఎంతోసేపు నిలవరించడం సాధ్యం కాదు కదా! చివరికి మమ్మల్నిలా కొట్టి వెళ్లిపోయారు'' అని చెప్పాడు సుప్రహస్తుడు.

''ఆ సైన్యం ఎటువైపు వెళ్లింది?'' అని అడిగాడు ఫణిదత్తుడు.

సుప్రహస్తుడు చూపించిన దిక్కుకు తన గుర్రాన్ని దౌడు తీయించాడు. ■

**(వచ్చేవారం.. మలుపు తిరిగిన జీవితం)**